ప్రజాశక్తి
సోమవారం 24 ఫిబ్రవరి 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

డిఎస్‌సిపై కాలయాపన !

- 2024 జూన్ 13న సంతకం
- తొలుత 2024 డిసెంబర్‌లోగా భర్తీ చేస్తామని ప్రకటన
- తర్వాత 2025 జూన్ వరకు దాటవేత
- డిఎస్‌సి సన్నద్ధతకు వ్యయ ప్రయాసలు
- అంగలూరు డైట్ కాలేజీలో లెక్చరర్ల కరువు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డిఎస్‌సి నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించింది. అధికారం చేపట్టిన తర్వాత 2024 జూన్ 13న డిఎస్‌సికి సంతకం చేసింది. 2024 డిసెంబర్ నాటికి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించింది. తర్వాత వివిధ కారణాలను చూపుతూ ఉపాధ్యాయ ఖాళీల భర్తీని వాయిదా వేస్తూ వస్తోంది. 2025 జూన్‌కు వాయిదా వేసింది. దీంతో డిగ్రీలు, పిజిలు పూర్తి చేసిన వారితో పాటు డైట్ శిక్షణ పూర్తయిన నిరుద్యోగ యువత డిఎస్‌సి కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరీక్ష గడువు పొడిగిస్తూ పోవడంతో పరీక్షల సన్నద్ధతకు ఖర్చులు తడిచిమోపెడవుతున్నాయని డిఎస్‌సి శిక్షణ పొందుతున్న వారు వాపోతున్నారు.



కృష్ణాలో 1208 ఉపాధ్యాయ ఖాళీలు

కృష్ణాజిల్లాలోని అవనిగడ్డ, పామర్రు తదితర ప్రాంతాల్లో పేరెన్నికగన్న డిఎస్‌సి శిక్షణ సంస్థలున్నాయి. అవనిగడ్డలో 4,200 మంది, పామర్రులో 6,102 మంది చొప్పున మొత్తం 10,302 మంది పేరెన్నికగన్న ప్రయివేటు సంస్థల్లో శిక్షణ పొందుతున్నారు. ఆరేళ్లుగా డిఎస్‌సి నిర్వహించకపోవడంతో గుడ్లవల్లేరు మండలం అంగలూరులోని డైట్ కాలేజీలో ఐదేళ్లుగా శిక్షణ పూర్తి చేసుకున్న మరో 250 మంది ఉన్నారు. వీరంతా (మిగతా 2లో)

నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం

- ఎవరు అధికారంలో ఉన్నా ప్రజా సమస్యలపై పోరాడతాం
- ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడేందుకు కృషి
- 'ప్రజాశక్తి'తో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తారని సిట్టింగ్ ఎమ్మెల్సీ,కృష్ణా -గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు తెలిపారు. 2007 నుంచి ఇప్పటి వరకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రజా సమస్యలపై శాసన మండలిలో రాజీలేని పోరాటం చేసి ఎన్నో సమస్యలు పరిష్కారానికి కృషి చేసినట్టు తెలిపారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడి నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తున్నామని తెలిపారు. ఎవరు సిఎంగా ఉన్నా ప్రజలకు మేలు చేస్తే సమర్థిస్తామని, ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే వ్యతిరేకిస్తామని వెల్లడించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

ప్రశ్న : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు చేసిన కృషి?

జవాబు : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కట్టుబడి జివో నెంబరు 117ను వ్యతిరేకించి 3,4,5 తరగతుల విలీనాన్ని వ్యతిరేకించాం. ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అండగా నిలిచాం. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు బడి కోసం బస్సు యాత్ర నిర్వహించాం. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పించడానికి సుదీర్ఘకాలం పోరాటం చేశాం. మునిసిపల్, ఎయిడెడ్, గురుకులాలు, మోడల్ స్కూల్స్, కస్తూరి భా విద్యాలయాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రయోజనాలను కాపాడేందుకు వివిధ రూపాల్లో ఆందోళనలు చేసి ప్రభుత్వంపై వత్తిడి తెచ్చాం.

ప్రశ్న : డిఎస్‌సి పోస్టుల భర్తీకి చేసిన పోరాటం?

జవాబు : ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి డిఎస్‌సి ద్వారా నోటిఫికేషన్లు విడుదల చేయాలని శాసన మండలిలో అనేక మార్లు గత ప్రభుత్వంపై వత్తిడి తెచ్చాం. జ్యాబ్ కేలండర్ ఇవ్వాలని, ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్నపోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశాం. ముఖ్యంగా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ల కోసం 2017 నుంచి 2024 వరకు అప్పటి ప్రభుత్వాలపై మండలిలో చర్చల ద్వారా ఎంతో వత్తిడి తెచ్చాం. దీని ఫలితంగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఒక రాజకీయ ఏజెండాగా ప్రధాన పార్టీలు చేపట్టే విధంగా కృషి చేశాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిఎస్‌సి ద్వారా 16,340 ఉపాధ్యాయుల (మిగతా 2లో)

స్టెల్లా కళాశాల వద్ద పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

గ్రూప్-2 మెయిన్స్

ప్రశాంతం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. విజయవాడలో మొత్తం 19 కేంద్రాల్లో 8,792 మంది అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేయగా ఉదయం జరిగిన పేపర్-1కు 83.89 శాతం (7,376), మధ్యాహ్నం జరిగిన పేపర్-2కు 83.62 శాతం (7,352) మంది హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన కోఆర్డినేటింగ్, కస్టోడియన్, రూట్, లైజనింగ్ అధికారులు తదితరులకు అభినందనలు తెలిపారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యం, విద్యుత్, ప్రజా రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.



విద్యుత్ ఛార్జీలు పెంచలేదనడం మోసపూరితం

- గంటకో ధరపై చిరువ్యాపారులు ఆగ్రహం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

జగ్గయ్యపేటలో విద్యుత్ బిల్లులను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు, జిల్లా కార్యదర్శి డివి కృష్ణ

విజయవాడ: 2025-26 సంవత్సరంలో విద్యుత్ ఛార్జీలు పెంచడంలేదని ప్రభుత్వం ప్రకటించడం మోసపూరితమని, టారిఫ్ పెంచకుండా సర్దుబాటు ఛార్జీల పేరుతో జనం నెత్తిన భారాలు వేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ ఇతర నేతలతో కలిసి జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, నందిగామ ప్రాంతాల్లో బాబూరావు ఆదివారం పర్యటించారు. జగ్గయ్యపేట షేర్ ముహమ్మద్ పేట గ్రామంలో ఇంటింటికి తిరిగి విద్యుత్ బిల్లులను పరిశీలించారు. చిరువ్యాపారంతో మాట్లాడారు. విద్యుత్ బిల్లులు మరింత పెరిగాయని ప్రజలు గగ్గోలు పెట్టారు. టైమ్ ఆఫ్ ది డే ప్రకారం గంటకు ఒక రేటు చొప్పున విద్యుత్ ఛార్జీలు నిర్ణయించే విధానంపై చిరు వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ బాటలో పయనిస్తూ విద్యుత్ భారాలు మోపటం తగదన్నారు. తొమ్మిది నెలల కాలంలో రెండు రకాల సర్దుబాటు ఛార్జీల రూపంలో 15,486 కోట్ల రూపాయలు అదనపు భారం మోపి, ఇక పెంచబోమని చెప్పడం మోసపూరితమన్నారు. వీటికి తోడు ప్రతినెలా యూనిట్ కు 40 పైసలు చొప్పున మరొక సర్దుబాటు ఛార్జీ వసూళ్లు కొనసాగుతున్నాయని చెప్పారు. చిరు వ్యాపారులు మొదలు నివాసేతర విద్యుత్ వినియోగదారులపై విద్యుత్ సుంకం యూనిట్‌కు ఆరు పైసల నుండి రూపాయికి పెంచుతూ కూటమి సర్కార్ చట్ట సవరణ చేసిందన్నారు. పాత బకాయిలతో సహా వసూలు చేయటానికి రంగం సిద్ధమైందన్నారు. భవిష్యత్తులో 2024-25 సంవత్సరం సర్దుబాటు ఛార్జీలు దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయలు భారం మోపటానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. ప్రజల కళ్లు కప్పి వాయిదాల పద్ధతిలో జనం మీద విద్యుత్ భారాలు మోపే విధానాలు అవలంభించడం అన్యాయమన్నారు. 2025 ఏప్రిల్ నుండి రాష్ట్రములోని చిరు వ్యాపారుల మొదలు వ్యాపార, చిన్న పరిశ్రమల అందరి నుండి టైమ్ ఆఫ్ ది డే విధానం ప్రకారం సాయంత్రం 6 గంటల నుండి 10 గంటలకు వినియోగించే విద్యుత్‌పై యూనిట్ కు అదనంగా 50 పైసలు నుండి రూపాయి అదనంగా వసూలు చేసే విధానాన్ని అమలు చేయబోతున్నారన్నారు. దీని కోసం ఆదానీ కంపెనీకి సంబంధించిన స్మార్ట్ మీటర్లు ఇప్పటికే చిన్న, మధ్య తరగతి వ్యాపార సంస్థలకు బిగించారని చెప్పారు. భవిష్యత్తులో గంటకొక రేటు నిర్ణయించే విధానాన్ని నివాస గృహాలకూ అమలు చేయటానికి సిద్ధమవుతున్నారని చెప్పారు. ప్రజలు ఈ కుట్రలను గమనించి మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సర్దుబాటు ఛార్జీల విధానం రద్దు కావాలని, గంటకు ఒక రేటు నిర్ణయించే పద్ధతి ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జగ్గయ్యపేట మండల కార్యదర్శి ఎస్.నాగమణి, స్థానిక నేతలు కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, లింగారావు, గౌస్మియా తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

డిఎస్‌సిపై కాలయాపన !

డిఎస్‌సి పరీక్షలకు రాత్రి పగలు సన్నద్ధం అవుతున్నారు. జిల్లాలో 981ప్రాథమిక, 143 అప్పర్ ప్రయిమరీ, 193 హైస్కూల్స్ ఉన్నాయి. మొత్తం 1317 పాఠశాలల్లో 82,926 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 250కిపైగా ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. తరగతికి నాలుగు నుంచి ఐదు సబ్‌జక్టులు ఒకే ఉపాధ్యాయుడు బోధించాల్సి వస్తోంది. అనారోగ్యం పాలయినా ఈ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సెలవులు తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోయాయనే ఆందోనతో తల్లిదండ్రులు పిల్లలను ప్రయివేటు పాఠశాలల్లో చేర్పుతున్నారు. ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలోనే స్కూల్ అసిస్టెంట్లు, సెకండ్ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జిటి) భాషా పండితులు (లాంగ్వేజ్ పండిట్స్) ఫిజికల్ డైరెక్టర్స్ (వ్యాయామ ఉపాధ్యాయులు)లకు సంబంధించి 1208 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ ప్రాథమిక నివేదిక సిద్ధం చేసింది. పోస్టుల భర్తీపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు వాయిదాలు వేయడం నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది.

అంగలూరు డైట్ కాలేజీపై నీలినీడలు

అంగలూరు డైట్ కాలేజీపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే ఈ కాలేజీలో లెక్చరర్ల పోస్టుల భర్తీని ప్రభుత్వాలు నిలిపివేశాయి. అరకొర సిబ్బందితోనే శిక్షణ ఇవ్వాల్సి వస్తోంది. ఈ కాలేజీలో 21 మంది సీనియర్, జూనియర్ లెక్చరర్ పోస్టులకు గానూ తొమ్మిది మంది మాత్రమే పనిచేస్తున్నారు. రెగ్యులర్‌గా డిఎస్‌సి నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడంతో డైట్ కాలేజీలో శిక్షణపైన ఆసక్తి సన్నగిల్లింది. దీంతో కాలేజీలో రెండు వందల సీట్లు కేటాయించగా కేవలం 88 మంది మాత్రమే శిక్షణ పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే డైట్ కాలేజీలు నిర్వీర్యం అయిపోతున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి.

నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం

పోస్టుల భర్తీకి తొలి సంతకం చేశారు. కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుని వెంటనే ఈ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి.

ప్రశ్న : ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన పోరాటాలు?

జవాబు : రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల కోసం పిడిఎఫ్ అనేక పోరాటాలు చేస్తోంది. 2022 ఫిబ్రవరి 3న విజయవాడ బిఆర్‌టిఎస్ రోడ్డులో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిర్వహించిన చారిత్రాత్మక పోరాటంలో పాల్గొన్నాం. ఎన్‌పిఎస్, సిపిఎష్, జిపిఎస్, యుపిఎస్‌లను వ్యతిరేకిస్తూ .జరిగిన ఉద్యమాల్లో పాల్గొని ఒపిఎస్ పునరుద్ధరణ కోసం అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాం. మండలిలో కూడా ఈ అంశాలపై చర్చలో పాల్గొని అప్పటి ప్రభుత్వాల తీరును ఎండగట్టాం.

ప్రశ్న : కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మేలు?

జవాబు : కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ జరిగిన అనేక పోరాటాల్లో నేరుగా పాల్గొని వారి డిమాండ్ల అమలుకు కృషి చేశాం. అలాగే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు నిర్వహించిన అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొనడమే కాకుండా నేరుగా శాసన మండలిలో ఆయా వర్కర్ల సమస్యల తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. కాంట్రాక్టు అధ్యాపకులు, 2008 డిఎస్‌సి, మినిమమ్ టైమ్ స్కేలు ఉపాధ్యాయులు, 1998 డిఎస్‌సి వారికి మినిమమ్ టైమ్ స్కేల్ డిమాండ్స్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపచేశాం. వైద్య ఆరోగ్యశాఖలో వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి కృషి చేశాం. అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యమాలకు మద్దతు ఇచ్చి వారి తరుపున మండలిలో పోరాడాం. 42 రోజుల పాటు జరిగిన సమ్మెకి మద్ధతు ఇచ్చాం. అలాగే ఆశా వర్కర్లు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, మునిసిపల్ కార్మికుల తదితర ఉద్యోగ, కార్మిక వర్గాలకు అండగా నిలిచాం. వారి డిమాండ్ల సాధనకు కృషి చేశాం.

ప్రశ్న : రైతాంగ సమస్యలపై పోరాటం?

జవాబు : ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాం. అలాగే మండలిలోనూ, జిల్లా పరిషత్, డిఆర్‌సి వేదికలపై కూడా రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశాం. ప్రధానంగా రైతులకు ఏటా ఎదురవుతున్న కల్తీ విత్తనాలు, ఎరువుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశాం. కల్తీ విత్తనాలు కొని నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాం. కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డుల జారీలో అలసత్వం, 2011 కౌలు రైతు చట్టం రద్దుపై అనేక పోరాటాలు చేశాం. భూ యజమాని సంతకం లేకుండా కౌలు రైతులకు సిసిఆర్‌సిలు ఇవ్వాలని డిమాండ్ చేసి ఎక్కువ మంది రైతులకు కార్డులు అందేలా కృషి చేశాం.

ప్రశ్న : నీటిపారుదల రంగానికి సంబంధించిన అంశాలు?

జవాబు : చెంతనే నాగార్జునసాగర్, కృష్ణా నది ఉన్నా ఇప్పటికి తాగు, సాగునీరులేక ఇబ్బంది పడుతున్న ప్రజల తరుపున అనేక ఉద్యమాలు నడిపాం. ప్రధానంగా పల్నాడులో వరికపూడిశెల ప్రాజెక్టు కోసం 20 ఏళ్లుగా ప్రతి సమావేశంలో ప్రస్తావిస్తున్నాను. గుంటూరు ఛానల్ విస్తరణ,పొడిగింపు ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీరు,50 గ్రామాలకు తాగునీరుఅందించేందుకు ప్రభుత్వంపై ఇప్పటికి వత్తిడి తెస్తున్నాం. ఎన్‌టిఆర్ జిల్లాలో కిడ్నీ బాధితుల సమస్యల పరిష్కారం కోసం ఏ.కొండూరు, గంపలగూడెం మండలంలో పర్యటనలు చేసి సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారికి స్వచ్ఛమైన నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నాం. అలాగే గంపలగూడెం మండలం హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని శాసన మండలిలో పోరాటం చేశాం.

కృష్ణా, గుంటూరు జిల్లాల అభివృద్ధికి కృషి

- నాపై వ్యక్తిగత దుష్ప్రచారం తగదు
- ఓటర్ల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది
- పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు

సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు ఛానల్ విస్తరణ, వరికెపూడిశెల, కృష్ణా జిల్లాలోని ఏకొండూరు కిడ్నీ బాధితుల సమస్యలు, కట్లేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే వివిధ రంగాలలో ఉన్న పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడుతానన్నారు. ముఖ్యంగా ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, 11వ వేతన సవరణలో న్యాయం జరగలేదని, 12వ వేతన సవరణ కమిషన్ ఇంత వరకూ నియమించలేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుండి రూ.22వేల కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో దాదాపు 1.40 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, నవంబర్‌లోగా పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. రెండు లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారని, 70 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారన్నారు. గతంలో ఆప్కాస్ వల్ల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కొద్దిపాటి భద్రతైనా ఉందని, ఇప్పుడు ఆప్కాస్‌ను రద్దు చేయాలనే ప్రభుత్వ ఆలోచనను మానుకోవాలన్నారు. 1.40 లక్షల మంది అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు ఇతర రంగాల స్కీమ్ వర్కర్లకు ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. రెండు జిల్లాలో విస్తృత ప్రచారం చేశామని, ఓటర్ల నుండి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్రూప్-2 మెయిన్స్ నిర్వహణపై విలేకరుల అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ప్రభుత్వం చర్చలు జరుపుతున్నామని ముందు రోజు చెబుతూ వచ్చిందని, కానీ పరీక్ష నిర్వహించారన్నారు. రోస్టర్ అమలు చేయకుండా పరీక్ష నిర్వహించటం సరికాదన్నారు. జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ గత నెలల పాలనలో ప్రధాన హామీలు ఏవీ నెరవేర్చలేదన్నారు. ఉద్యోగాల కల్పనగానీ, ప్రాజెక్టులకు నిధులు లేవన్నారు. నిరంతరం ప్రజల కోసం పనిచేస్తే లక్ష్మణరావును గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ బంజార హిల్స్‌లో కోట్ల విలువైన ఇంటి స్థలాలను తిరస్కరించి, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరిన ఘనతకు పిడిఎఫ్‌కు ఉందన్నారు. 18 ఏళ్లలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజల కోసమే పనిచేశామని చెప్పారు. విద్య, వైద్యం పెద్ద ఎత్తున ప్రైవేటుపరం అవుతున్న నేపథ్యంలో వాటి పరిరక్షణకు పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.హనుమంతరావు, జెవివి నాయకుటు టి.జాన్‌బాబు, రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ నాయకులు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత దుష్ప్రచారం తగదు

గత మూడు నాలుగు రోజులుగా ప్రత్యర్థి నుండి తనపై వ్యక్తిగత దుష్ప్రచారం తగదని లక్ష్మణరావు అన్నారు. ఆ విధంగా తాము కూడా చేయదలుచుకుంటే చాలా ఉన్నాయన్నారు. అటువంటి విధానం మాది కాదన్నారు. ధైర్యం ఉంటే విధానాల ప్రాతిపదికన పోరాడాలన్నారు. మీరు ప్రజలకు ఏం చేశారో మీరు చెప్పండి... మేం ఏం చేశామో చెబుతామని ఘాటుగా స్పందించారు.అలా కాకుండా వ్యక్తిగతంగా కించపరిచే చర్యలు మానుకోవాని హితవుపలికారు. ఇటువంటి తప్పుడు విమర్శలను విజ్ఞులైన ఓటర్లు గమనిస్తూనే ఉన్నారన్నారు. గత సిఎం జగన్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు హెలీప్యాడ్ వద్ద వివిధ రకాల సమస్యలపై వేర్వేరు వినతిపత్రాలు ఇచ్చే క్రమంలో కింద జారిపడిన కాగితాన్ని తీసుకుంటుంటే సిఎంకు కాళ్లు మొక్కినట్లు ప్రత్యర్థులు చిత్రీకరించటం శోచనీయం అన్నారు. ఏ ప్రభుత్వానికి కాళ్లు మొక్కే సంస్కృతి మాకు లేదని మంచి చేస్తే సమర్థిస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తే తప్పుని చెబుతూ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించామని చెప్పారు.

రైతులు విశిష్ట గుర్తింపు నమోదు సంఖ్య పొందాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల : రైతులందరూ పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకుని వెళ్లి విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని గన్నవరం వ్యవసాయ సంచాలకులు ఎం. సునీల్ అన్నారు. ఆదివారం ఆయన పమిడిముక్కల మండలంలోని మేడూరు, కపిలేశ్వర పురం తదితర గ్రామాలలో రైతు సేవా కేంద్రాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. పంట అధిక దిగుబడి రావడానికి ఎక్కువగా సహజ ఎరువుల ఆయన సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, రైతు భరోసా, అన్నదాత సుఖీభవ, కేంద్ర ప్రభుత్వ పథకాలు విశిష్ట నమోదు సంఘ ద్వార రైతులకు అందజేస్తారన్నారు. విశిష్ట సంఖ్యను తప్పక రైతులందరూ నమోదు చేయిం చుకోవాలని తెలిపారు. పమిడి ముక్కల వ్యవసాయశాఖాధికారి గణేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు

విద్యార్థులకు సూచనలు చేస్తున్న దేవరపల్లి సురేష్

ప్రణాళికతో చదివితే విజయం సొంతం

ప్రజాశక్తి-చల్లపల్లి : జీవితంలో చేసే ఆలోచనలను బట్టే వాళ్ళ భవిష్యత్ నిర్ణయించ బడుతుందని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ అన్నారు. చల్లపల్లి మండలం వక్కలగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఇంస్టాగ్రామ్, ఫేస్ బుక్ రీల్స్‌కు బానిసలుగా మారి జీవితంలో విలువైన సమయాన్ని వధా చేసుకోవద్దని తెలిపారు. జీవితంలో సరైన ఆలోచనలు, ప్రణాళికలతో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే అనుకున్న లక్ష్యాలను సులువుగా సాధించవచ్చన్నారు. భవిష్యత్తులో సాధించబోయే లక్ష్యాలను ఊహించు కుంటూ కష్టంతో కాకుండా ఇష్టంతో విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థులకు సరైన ఆహారం, నిద్ర,ఏకాగ్రత చాలా అవసరం అన్నారు. పరీక్షలంటే భయం, ఒత్తిడి, ఆందోళన లను దరి చేరనీయొద్దన్నారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి పరీక్ష లలో మార్కులు సాధించడానికి ఉపాధ్యాయుల సూచనలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు మట్టా రాజా, గద్దె లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేరికకు ప్రాధాన్యం

- కెయు నూతన ఉపకులపతి ఆచార్య రాంజీ బాధ్యతల స్వీకారం

బాధ్యతలు స్వీకరిస్తున్న రాంజీ

ప్రజాశక్తి -మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలలలో విద్యార్థుల చేరికకు ప్రథమ ప్రాధాన్యత ఉంటుందని కృష్ణా విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి ఆచార్య కె రాంజీ పేర్కొన్నారు. ఆదివారం కెయూ ఉపకు లపతిగా ఆయన భాధ్యతలు స్వీకరిం చారు. అనంతరం పాత్రికే యులతో మాట్లాడుతూ ప్రస్తుతం విశ్వ విద్యాలయంలో నిర్మాణంలో ఉన్న అన్ని భవనాలను పూర్తి చేయడంతో పాటు ఏడాది లోపు బాలుర వసతి గహ భవన నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు. అన్ని రంగాల్లో విశ్వవిద్యాలయంను ముందుకు తీసుకుని వెళ్ళడం తో పాటు ప్రాంగణంలో పచ్చదనం పెంచడానికి సిబ్బందిని, విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం ద్వారా క్రీడా ప్రాంగణం ను అభివద్ధి చేస్తామని తెలిపారు. మావేశంలో రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్ బాబు, విభాగ అధిపతులు పాల్గొన్నారు. తొలుత నూతన ఉపకులపతి గా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య కె రాంజీ నీ విశ్వవిద్యాలయ ఆద్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు.

గుంతలరోడ్డుపైనే ప్రయాణం

- వాహనదారుల ఇబ్బందులు
- అధ్వానంగా మారిన రోడ్లకు మోక్షమెప్పుడో..?

ప్రజాశక్తి-నందివాడ : మండలంలోని వివిధ గ్రామాల రహదారులు గుంతల మాయంగా మారి అధ్వానంగా మారాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెల కొందని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా తయారైన రహదారులకు మోక్షం ఎప్పుడోనని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పుట్టగుంట నుంచి ఒద్దుల మెరక, చేదుర్తిపాడు, వయా గన్నవరం వెళ్లే ప్రధానరహదారి అధ్వానంగా మారింది. ఇటీవల వచ్చిన వరదల కారణంగా రోడ్లుభారీగుంతలు పడి అధ్వానంగా మారి ద్విచక్ర వాహనాలు కూడా తిరుగలేని పరిస్థితి దాపురించింది. రాత్రి సమయంలో రాకపోకలు సాహసోపేతంగా మారాయని వాహన చోదకులు వాపోతున్నారు.

మరమ్మతులు చేయించాలి
తోట గోపాలకృష్ణ, సర్పంచ్, ఒద్దులమమెరక

వరదలు కారణంగా దెబ్బతిన్న రోడ్లను అధికారులు స్పందించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలి. తద్వారా వాహనదారులకు గ్రామస్తులకు విముక్తి కలిగించాలి.

ఎర్రన్నాయుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి - గుడివాడ : పేదల పక్షాన నిలబడి వారికి ఎనలేని సేవలు చేసిన నాయకుడు ఎర్రన్నాయుడని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. కేంద్ర మాజీ మంత్రి, కింజరపు ఎర్రన్నాయుడు 68వ జయంతి వేడుకలను ఆదివారం స్థానిక ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం పజా వేదికలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ ఎర్రన్నాయుడు పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, బిజెపి కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, నాయకులు రెడ్డి షణ్ముఖ, వంగపండు ఆదినారాయణ, అడుసుమిల్లి శ్రీనివాస్, సింగవరపు ప్రభాకర్, గొర్రెల నరేంద్ర, అమర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రన్నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేయడం దారుణం

సమరంను అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - గుడివాడ : గ్రూప్-2 అభ్యర్థులకు న్యాయం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులను కూటమి ప్రభు త్వం ఆదివారం అక్రమంగా అరెస్టు చేయడం, నిర్బంధిం చడం దారుణమని ఎస్ఎఫ్ఐ కష్ణాజిల్లా కార్యదర్శి ఎస్.సమరం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం సమరంను పోలీసులు ఆయన ఇంటి వద్ద అరెస్టు చేసి అనంతరం విడుదల చేశారు. విడుదల అనంతరం సమరం మాట్లాడుతూ గ్రూప్-2 అభ్యర్థులను ప్రభుత్వం అయోమయం స్థితిలో పడవేసి చివరికి వారి భవిష్యత్తుకు ఆటంకం సృష్టించే విధంగా నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఏదైతే గ్రూప్-2 విద్యార్థులు గ్రూప్ 2 ఎగ్జామ్ వాయిదా వేయాలని విన్నవించుకున్నారో దానిని పరిగణలోకి తీసుకుంటున్నాం కచ్చితంగా వాయిదా వేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడం, రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రూప్-2 అభ్యర్థులకు న్యాయం చేస్తామని చెప్పి, ఏపీ డీఎస్సీకి లెటర్ రాస్తున్నామని, వాయిదా వేస్తామని గ్రూప్-2 అభ్యర్థులందరిని నమ్మించి చివరికి రాత్రి 7 గంటలకి యధావిధిగా ఎగ్జామ్ జరుగుతాయని ప్రకటించడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐగా తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇది గ్రూప్-2 అభ్యర్థులని మోసగించడమేనని వారి భవిష్యత్తును నాశనం చేసే విధంగా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని ఈ విధానాన్ని తప్పుపట్టారు. ఇలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకుని నిరుద్యోగుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆడుకుంటుందని త్వరలోనే కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెపుతామని సమరం హెచ్చరించారు.

గంజాయి మత్తులో వ్యక్తిపై దాడి

దాడి చేస్తున్న యువకులు

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు గ్రామంలోని హైస్కూల్ సమీపంలో ఓ హెూటల్ నిర్వాహకుడిపై గంజాయి మత్తులో విచక్షణా రహి తంగా దాడి చేసిన యువ కులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని హోటల్ నిర్వహించే అబ్ర హం వద్దకు గంజాయి మత్తులో అదే గ్రామానికి చెందిన అభిషేక్, దినేష్, దారనిష్ వచ్చి సిగరెట్లు తీసుకొని డబ్బులు ఇవ్వకపోవడంతో అడగడంతో వారు అబ్రహంపై దాడి చేశారు. సమాచారమందుకున్న పోలీసులు వచ్చి గంజాయి సేవించిన యువకులను అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడిన అబ్రహంను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హైస్కూల్ సమీపంలో యువకులు రాత్రి పగలు తేడా లేకుండా గంజాయి సేవిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. గంజాయి సేవించకుండా పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం

ప్రజాశక్తి-నందివాడ : మండలంలోని తమిరిశ గ్రామం కుముదలవాడలో సంతాన నాగేంద్రస్వామి వారి ఆలయంలో శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల వార్షిక కళ్యాణ మహెూత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కమిటీ మెంబర్లు గుత్తా త్రివిక్రమరావు, వెంకట రజనీకుమారి ఆలమూరి లోకేశ్వరరావు, భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా పంచాయతన ప్రతిష్టా మహోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న అవనిగడ్డ ఎంఎల్ఎ బుద్ధప్రసాద్, మచిలీపట్నం ఎంపి బాలశౌరి

ప్రజాశక్తి-మోపిదేవి : చల్లపల్లి మండల పరిధిలోని పాగోలులో నూతనంగా నిర్మించిన శ్రీకైవల్యా శ్రమ చలాచల బోధోపదేశ మందిరంలో ఆదివారం శ్రీ కమలాత్మికా సహిత అచలేశ్వర పంచాయతన ప్రతిష్టా మహెూత్సవాలు వైభవంగా జరిగాయి. ప్రాతూరి విద్యాసాగర్ గురూజీ పర్యవేక్షణలో డాక్టర్ వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని, వడ్లమాని కేదారశర్మల నేతత్వంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ చాపరాల గాంధీప్రసాద్, ట్రస్టీ మేకా సత్యనారాయణ ప్రసాద్ (బంగారుబాబు), వక్కలగడ్డ దుర్గాప్రసాద్ దంపత్ సమేతంగా హెూమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం మూలా నక్షత్రయుక్త మేష లగ్న పుష్కరాంశమందు ప్రతిష్టా మహెూత్సవం జరిగింది. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రతిష్టా మహెూత్సవంలో భాగస్వాములు అయ్యారు. చల్లపల్లి సిఐ ఈశ్వరరావు పాగోలు పంచాయతీ కార్యదర్శి పి రాంబాబు తదితరులు పాల్గొన్నారు

ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న ఎంపి బాలశౌరి :

అలాగే ప్రతిష్టా మహోత్సవంలో మచిలీపట్నం ఎంపి బాలశౌరి, మోపిదేవి మండల జనసేన పార్టీ అధ్యక్షులు రత్న గోపాల్ యార్లగడ్డ శ్రీనివాసరావు మంగళాపురం సర్పంచ్ డొక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అడుగడుగునా ప్రలోభాలే...

విద్యారంగం అధికారులను ఉపయోగించి ఉపాధ్యాయులపై ఒత్తిడి
పలు రూపాల్లో కూటమి అభ్యర్థి తరపున ప్రచారం

ప్రజాశక్తి-విజయవాడ

కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు కేవలం మూడు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ప్రధాన పోటీదారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రధానంగా పిడిఎఫ్ అభ్యర్థిగా కెఎస్ లక్ష్మణరావు, కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజా పోటీలో ఉన్నారు. కూటమి అభ్యర్థి రాజా ప్రభుత్వం అండదండలతో తనదైన శైలిలో ఓటర్లను, అలాగే అధికారులను ప్రలోభాలకు గురి చేస్తున్నట్లు తెలిసింది. లక్ష్మణరావు నుంచి గట్టి పోటీ ఉండటంతో ఓట్లు చేర్పించిన దగ్గర నుంచి ఓటర్ల లిస్టు తయారీ, అలాగే పోలింగ్ రోజు విధులు నిర్వర్తించే పిఒ (పోలింగ్ ఆఫీసర్స్)ల ఏర్పాటు తదితర అంశాల్లో కూటమి అభ్యర్థి పలు రకాలుగా తికమకలు చేస్తున్నట్లు తెలిసింది. భర్త ఓటు విజయవాడ నగరంలోని సత్యనారాయణపురం ఏరియాలో ఉండగా, భార్య ఓటుకొచ్చేసరికి కృష్ణలంక 21వ డివిజన్ ఏరియాల్లో ఉండే విధంగా ఓటర్ల లిస్టు తయారు చేసినట్లు తెలిసింది. అలాగే రేపు ఎన్నికల విధుల్లో కీలకంగా వ్యవహరించాల్సిన పిఒల ఏర్పాటు కూడా అంతా కూటమి అభ్యర్థికి అనుకూలంగా వ్యవహరించే వారిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. అలాగే ఓటుకు రూ.3 నుంచి 5 వేల వరకు కూడా కూటమి అభ్యర్థి తరుపున డబ్బుల పంపిణీ కార్యక్రమాన్ని ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రారంభించినట్లు జోరుగా కథనాలు వినిపిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యేలు సైతం నేరుగా మునిసిపల్ స్కూల్స్ వద్దకు చేరుకుని, విద్యారంగం ఉన్నతాధికారులతో ఒత్తిడి చేయించి, కూటమి అభ్యర్థికి టీచర్లు ఓటు వేయాలనే దిశగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే అనేక మంది ఉపాధ్యాయులు యుటిఎఫ్‌తో పాటు ఇతర యూనియన్లలో ఉంటూ, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న స్థానిక ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుకు ఓటు వేయడానికే మొగ్గు చూపుతున్నట్లు వారిలో వారే చర్చించుకోవడం గమనార్హం. ప్రజా సంఘల్లోని గ్రాడ్యుయేట్ ఓటర్లు విస్తృత స్థాయిలో వారి ప్రాంతాల్లో ప్రచారాన్ని నిర్వహిస్తూ కెఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ నగరంలో ప్రచారం నిర్వహిస్తున్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసు

ప్రజాశక్తి- నందిగామ : 112 కాల్ కి స్పందించి వ్యక్తి ప్రాణాలను నందిగామ పోలీస్ కాపాడారు. వివరాల్లోకి వెళితే నందిగామ పాత బస్టాండ్ సమీపంలో ఆడితి రోడ్లో ఆర్‌టిసి యూని ఫాంలో పడిపోయి ఉన్న గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయి ఉండగా అటుగా వెళుతున్న కొందరు వ్యక్తులు 112 కి కాల్ చేసి విషయం పోలీస్ వారికి చెప్పారు. పోలీస్ వారు వెంటనే స్పందించి డ్యూటీలో ఉన్న సంతోష్, పుల్లారావు అక్కడికి వెళ్లగా స్పృహ కోల్పోయి పడి ఉన్న వ్యక్తికి సంతోష్ అనే పోలీస్ వారు ప్రథమ చికిత్స సిపిఆర్ చేశారు. నందిగామ ఏరియా హాస్పిటల్‌కి తీసుకువెళ్లారు. తదుపరి హాస్పటల్లో చికిత్స అనంతరం వ్యక్తి స్పృహలోకి వచ్చాడు. తాను ఎపిఎస్ ఆర్టీసీ డ్రైవర్ని అని ప్రథమ చికిత్స అందించి హాస్పిటల్ తీసుకువచ్చిన పోలీసు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

8న బంపర్ డ్రా

ప్రజాశక్తి - నందిగామ : ప్రముఖ ఆయిల్ కంపెనీ ఇండియన్ ఆయిల్ వారు ఈ నూతన సంవత్సరంలో మహిళా దినోత్సవం మార్చి 8న రాష్ట్రవ్యాప్తంగా జరిగే బంపర్ డ్రాలో 1,62,094 బహుమతులను తమ వినియోగదారులకు అందించనున్నారని ఇండియన్ ఆయిల్ ఏరియా సేల్స్ ఆఫీసర్ వరప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన నందిగామలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ డ్రాలో వినియోగదారులకు బహుమతులు అందిస్తున్నామన్నారు. మార్చి 8న డ్రా తీసి బహుమతులను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇండియన్ ఆయిల్ సేల్స్ మేనేజర్ వరప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారులకు ప్రోత్సాహకంగా, గృహాలకు ఉపయోగపడేలా నాలుగు మారుతి స్విఫ్ట్ 16 కార్లు, 4 హోండా సిటీ కార్లు 4 రాయల్ ఎన్ఫీల్డ్ బుల్లెట్లు, 70 హీరో హోండా మోటార్ సైకిల్స్, 1000 ఐరన్ బాక్సులు, 1000 పవర్ బ్యాంకులు, వెయ్యి బ్లూటూత్ స్పీకర్లు, 18000 డిజిటల్ వాచ్లు, 36000 చాపర్‌లు 18,000 కారు వ్యాక్యూమ్ క్లీనర్లు అందిస్తున్నామని మొత్తం వీటి విలువ మూడు కోట్ల రూపాయలు ఉంటుందని తెలిపారు. రూ.300 లు పైన పెట్రోల్, రూ.వెయ్యి పైన డీజిల్ పోయించుకున్న వినియోగదారులకు ప్రతిరోజు సెల్ నెంబర్లు నమోదు చేసి ఆన్లైన్ ద్వారా మార్చి 8వ తేదీన డ్రా తీస్తామన్నారు. వినియోగదారులు మధిర రోడ్ లోగల తాళ్లూరి పెట్రోల్ బంక్‌లో ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని స్థానిక డీలర్ తాళ్ళూరి అరుణ తెలిపారు. వివరాలకు స్థానిక డీలర్ 9912665885ను సంప్రదించాలని కోరారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీనిధి టెక్నో స్కూల్లో శనివారం సాయంత్రం పదోవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని 9వ తరగతి విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గడ్డం బాలకృష్ణ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో, నిబద్ధతతో చదివితే మంచి ఫలితాలను సాధిస్తారని చెప్పారు. కష్టపడితే ఫలితం దానంతట అదే వస్తుం దని దానికి ఉదాహరణ తన జీవితమేనని విద్యార్థుల కు వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్ర మాలు చూపరులను ఆకట్టుకున్నాయి. తొమ్మిదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్న పదో తరగతి విద్యార్థులకు, పెన్నులు ప్యాడ్లు ఇచ్చి మంచి ఫలితాలతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఎం.కిషోర్‌బాబు, డైరెక్టర్ బొంతు మహేష్, ప్రిన్సిపల్ ఆర్.వెంకట్ నారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ముగిసిన ఉచిత పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ : రెండు రోజులుగా స్థానిక సర్వోత్తమ గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం, సర్వోత్తమ గ్రంథాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఇందులో సాధారణ గ్రంథాలతో పాటు తత్వశాస్త్రం, మతాలు, నవల, ఆధ్యాత్మిక, సాంఘిక, బాల సాహిత్యాలు, వ్యక్తిత్వ వికాసం, చరిత్ర, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, ఇంజనీరింగ్, మెడికల్ సైన్స్‌తో పాటు పాఠ్య గ్రంథాలు, వివిధ విద్యా సంస్థల స్టడీ మెటీరియల్స్‌తో పాటు అనేక విషయాలకు చెందిన 25 వేలకు పైగా పుస్తకాలు ప్రదర్శితమయ్యాయి. అరుదైన, ఎక్కడా లభించని పుస్తకాలు ఇందులో ఉన్నాయి. ఆదివారం కావడంతో విద్యార్థులు, ఉద్యోగస్తులు, వివిధ విద్యాసంస్థలు వారు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈసారి పిల్లలే వారి తల్లిదండ్రులు పెద్దలను వెంటబెట్టుకుని కార్యక్రమానికి రావడం విశేషం. ఈ రెండు రోజుల్లో సుమారు ఎనిమిది వేలకు పైగా పౌరులు ఈ కార్యక్రమాన్ని దర్శించి 14 వేలకు పైగా పుస్తకాలు తీసుకెళ్లారు. ఎక్కడ దొరకని ప్రస్తుత ముద్రణలో లేని అపురూప పుస్తకాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు తమకు లభించాయని సందర్శకులు ఆనందం వ్యక్తం చేశారు. గత ఎనిమిది సంవత్సరాలుగా తాము నిర్వహిస్తున్న ఈ బృహత్కార్యానికి అన్ని విధాలా సహకరిస్తున్న పుస్తక దాతలకు, వివిధ పాఠశాలల కళాశాల యాజమాన్యాలకు, ప్రచురణకర్తలు, తల్లిదండ్రులకు, కార్యక్రమ నిర్వహణ కార్యదర్శి డాక్టర్ రావి శారద కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయంలో మాతృభాషా దినోత్సవం

విజయవాడ : విజయవాడలో గల ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాతృ భాషా ఆవశ్యకత కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు అధ్యాపకులు వల్లభనేని సుమతి హాజరై మాట్లాడారు. తల్లితండ్రులు సమాజంలో పిల్లలకు మాతృభాష ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులను గ్రంథాలయాలు అలవాటు చేసి భాషను అభివృద్ధి చేసుకుంటూ పిల్లల్ని ఉన్న స్థానాల్లో నిలబెట్టాలని పేర్కొన్నారు. మాతృ భాషలో చదువుకున్న వాళ్లే ఎక్కువగా అనేక విజయాలు సాధిస్తున్నారని అన్నారు. మాతృ భాషలో బోధన, శక్తిని ఉపయోగించుకొని విద్యార్థులను పిల్లలను గ్రంథాలయాలు అలవాటు చేసి మాతృభాషా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జరుపుకోవాలని గ్రంథాలయంలో భాషకు సంబంధించి అనేక పుస్తకాలు ఉన్నాయని అన్నారు. పుస్తకాలను చదువుకొని జీవితంలో పిల్లలు మంచి స్థానాల్లో నిలబడటానికి ఎంతో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాషా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

భూ సమేత వెంకటేశ్వరుని కళ్యాణం

ఉత్సవాల్లో పాల్గొన్న ఆలయాధికారులు, యాత్రికులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ సమీపంలోని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లైవ్ స్టోన్ క్వార్టర్ ప్రాంగణంలో గల శ్రీ భూ సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీనివాసుని కళ్యాణం వైభవంగా జరిగింది. శ్రీ భూ సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి 32వ వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో వి ఎస్ పి పూర్వ ఉద్యోగి విజయవాడ వాస్తవ్యులు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఫోగ్రాం కోఆర్డినేటర్ బి భీమరాజు, వారి సతీమణి వాసవి క్లబ్ విజయవాడ డైమండ్ కపుల్స్ అధ్యక్షురాలు వెంకట సూర్య నాగ దుర్గ దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు టిఎల్ఎన్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విఎస్‌పి జేఎల్ఎం ఇన్చార్జ్ నాగరాజు దంపతులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విఎస్‌పి జెఎల్ఎం డాక్టర్ కుసుమ నరేష్ దంపతులు, విఎస్‌పిజెఎల్ఎం పూర్వ ఉద్యోగులు వి.ఆంజనేయులు, మోహనరావు, తదితర పూర్వ ఉద్యోగులు, సురేష్, చిన ఈశ్వరయ్య ఆనందబాబు, తదితరప్రముఖులు పెద్ద సంఖ్యలో మహిళా యాత్రికులు దర్శించుకున్నారు.

మండలంలోని ముక్త్యాల గ్రామంలో గల శ్రీ భవానీ ముక్తేశ్వరస్వామి వారి దేవస్థానంలో శివరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మార్చి 3 వరకు జరుగుతున్న భాగంగా మొదటి రోజు ఆదివారం స్వామిని పెండ్లి కుమారుని చేశారు. ఈ కార్యక్రమంలో కె.సి.పి. నుండి ఏజియమ్ పాటిబండ్ల రాంప్రసాద్, యాత్రికులు పాల్గొన్నట్లు దేవస్థాన ఇఒ కానూరి సురేష్ బాబు తెలిపారు.

చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వర్మీ కంపోస్టుపై అవగాహన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఈలప్రోలు గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ రాజ్ కమిషనర్, జిల్లాపంచాయతీ అధికారి ఆదేశానుసారం శనివారం, ఆదివారం గ్రామంలోని ప్రతీ ఇంటినుండి చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరుగా ఇవ్వాలని అవగాహన కల్పించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో తడి చెత్త నుండి వర్మీ కంపోస్ట్ తయారుచేస్తారని పొడి చెత్తను రీసైక్లింగ్ కు వినియోగిస్తారని టాం టాం చేయించారు.

లింగాలపాడు గ్రామ పంచాయతీకి చెత్త సేకరణకు బహూకరించిన రిక్షా

రిక్షా బహూకరణ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం లింగాలపాడులో ఆదివారం గ్రామ పంచాయతీ పరిధిలోని తడి చెత్త పొడి చెత్త సేకరణకు రిక్షా బహూకరించారు. లింగాలపాడు గ్రామానికి చెందిన దిగుమర్తి రాంబాబు తల్లి దిగుమర్తి బేబి సరోజినీ జ్ఞాపకార్థం రూ.28,500లు విలువ గల రిక్షా బహూకరించారు. కార్యదర్శి కె.సీతారామిరెడ్డి గ్రామ నాయకులు డి.నారాయణ పాల్గొన్నారు.

క్రికెట్‌ను వీక్షించిన శివనాథ్, లోకేష్

ప్రజాశక్తి-విజయవాడ: ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఇండియా-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌ను ఏసిఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వీక్షించారు. ఇద్దరూ టీమిండియా జెర్సీలు వేసుకుని మ్యాచ్‌ను తిలకించారు. వీరితో పాటు ఈ మ్యాచ్ ను వీక్షించిన వారిలో ఏసీఏ కార్యదర్శి రాజ్యసభ ఎంపి సానా సతీష్, సినీ డైరెక్టర్ సుకుమార్ ఉన్నారు.

లక్ష్మణరావు గెలుపు కోరుతూ ప్రచారం

మోపిదేవి మండలంలో...

మొవ్వ మండలంలో...

ప్రజాశక్తి-ఉయ్యూరు : ప్రజా సంఘాల బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుని గెలిపించాలని కోరుతూ ఉయ్యూరులో సిఐటియు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం ముమ్మురంగా నిర్వహించారు. కె ఎస్ లక్ష్మణరావు ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ ప్రచారంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులకి రాజేష్, ప్రజా సంఘాల నాయకులు పడాల లక్ష్మణరావు, నిమ్మది గోపాల్, బి కీర్తి ప్రేమ్, కెవిపి టి లక్ష్మణరావు, వెంకయ్య, వీరయ్య , రత్నం భాస్కరరావు అన్నే సుబ్బారావు పాల్గొన్నారు. ప్రజాశక్తి-మోపిదేవి : త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కే ఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం ఆదివారం మండల పరిధిలోని మోపిదేవి లంక పోచగాని లంక గ్రామాల్లో సిపిఎం శ్రేణులు విస్తృత ప్రచారం చేపట్టారు. మోపిదేవి మండలం సిఐటియు కార్యదర్శి సిరివెళ్ల రాజశేఖర్, రైతు సంఘం నాయకులు మరిదు సురేష్‌బాబు, మోపిదేవి మండల సిపిఎం కమిటీ సభ్యులు బెజవాడ నాగేశ్వరరావు, రామారావు, పులివర్తి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-చల్లపల్లి : కె ఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ మొవ్వ గ్రామంలో ప్రజాసంఘాల నేతలు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ, అధ్యాపక, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మిక, కర్షక, వివిధ సంఘాలు బలపర్చిన కే ఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. అన్ని వర్గాల సమస్యలపై శాసన మండలిలో మాట్లాడే వ్యక్తి నీతి,నిజాయితీతో రాజ్యాంగ బద్ధంగా నడుచుకునే లక్ష్మణరావు గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ప్రజా సంఘాల కార్యకర్తలు. శీలం నారాయణరావు, కాకి రాజశేఖర్, కొడాలి కరుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు మండలంలో...

నేడు సత్యనారాయణ సంతాప సభ

సత్యనారాయణ (ఫైల్)

ప్రజాశక్తి మోపిదేవి : పోరాటాల పురిటి గడ్డ మోపిదేవి మండలంలో 1975 సంవత్సర కాలంలో కమ్యూనిస్టు ఉద్యమాల పట్ల ఆకర్షితులై చురుకైన పాత్ర పోషించిన యార్లగడ్డ సత్యనారాయణ ఇటీవల వయోభారంతో మరణించారు.సోమవారం రావివారి పాలెంలో ఆయన సంస్మరణ సభ జరుగుతుందని యార్లగడ్డ సత్యం కుమార్తె కళ్యాణి తెలిపారు. ప్రజాశక్తి సాహిత్యం పట్ల ఎంతో ఆసక్తిగా నిరంతరం ప్రజాశక్తి పాఠకుడుగా ఆయన సిపిఎం సిద్ధాంతాలను పాటిస్తూ ఎంతోమందికి మార్గదర్శకంగా నిలిచే వారిని ఆయనతో పాటు కలిసి పనిచేసిన మోపిదేవి మండల మాజీ సిపిఎం కార్యదర్శి విశ్వనాథపల్లి రాజారావు తెలిపారు. చల్లపల్లి జమిందారీ మిగులు భూములు పేదలకు పంచడంలో జరిగిన ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించారు. నాగాయ్యతిప్పల్లో కూడా ఉన్న యార్లగడ్డ వంశీయులతో ఆయన మంచి చెడులకు వచ్చిపోతూ అనుబంధం కొనసాగించారు. చల్లపల్లి మాజీ ఎంపీపీ యార్లగడ్డ సోమశేఖర్ ప్రసాద్ ఏలియాస్ లంక బాబు, మోపిదేవి మాజీ సర్పంచ్ సి డి సి చైర్మన్ రావి నాగేశ్వరరావు తదితరులు గతంలో యార్లగడ్డతో గల సన్నిహిత సంబంధాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సంతాప సభకు సత్యం అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆమె కుమార్తెలు, మనవళ్లు విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న ప్రముఖ వైద్యులు వంశీ

శివరాత్రి ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం మద్దూరు గ్రామంలో ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా కృష్ణానదిలో నిర్వహించే ఏర్పాట్లును కంకిపాడు మండల తహసీల్దార్ భవన్నారాయణ ఆదివారం పరిశీలించారు. పుణ్యస్నా నాలను ఆచరించేందుకు మద్దూరు ఘాట్ వద్దకు భారీగా భక్తులు హాజరవుతారని, ఈతగాళ్లను రంగంలోకి దింపి, బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఏర్పాట్లను మద్దూరు గ్రామ సర్పంచ్ చిప్పల రాందాస్, కార్యదర్శి కిరణ్ కుమార్‌లు పనులను పర్యవేక్షించారు.

ఘనంగా ఉప్పులేటి ప్రసాదరావు శత జయంతి

హనుమాన్‌జంక్షన్ : బండారుగూడెం గ్రామ మాజీ సర్పంచ్, అభ్యుదయవాది ఉప్పులేటి ప్రసాదరావు శత జయంతి కార్యక్రమం ఆదివారం ఆయన స్వగ్రామం కృష్ణాజిల్లా బాపులపాడు మండలం బండారు గూడెంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వడ్లమూడి తిరుపతిరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కొరివి వినయ్ కుమార్, మేళం భాగ్యారావు, పోలిమెట్ల జయరాజు తదితరులు పాల్గొని ప్రసాదరావు సేవానిరతిని, ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. ప్రసాదరావు దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రసాదరావు కుమారులు ఉప్పులేటి నేతాజీ (జనహిత వేదిక అధ్యక్షులు), దేవీప్రసాద్ (మాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు), డాక్టర్ తారక ప్రసాద్, సత్యప్రసాద్, సుందర ప్రసాద్, కుమార్తెలు ఝాన్సీ, ఉదయ కుమారితోపాటు డి.కోటేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొని దంపతుల విగ్రహాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ప్రజలకు, ముఖ్యంగా బండారుగూడెం గ్రామానికి ప్రసాదరావు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. అనంతరం సుమారు వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్ పాత్రలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

ఉప్పులేటి ప్రసాదరావు దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పిస్తున్న ముఖ్య అతిథులు, కుటుంబ సభ్యులు

అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం

ప్రజాశక్తి - గుడివాడ : డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ సైటస్ ఇన్వరసస్ టోటాలిస్ అనే అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని డాక్టర్ పొట్లూరి వంశీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన మహిళకు ఎడమ పక్క డొక్కులో నొప్పి రావడంతో వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ పరీక్షలలో ఆమెకు సైటస్ ఇన్వరసస్ టోటాలిస్ అనే అరుదైన పరిస్థితి ఉందన్నారు. ఈ వ్యాధి ఉన్నవారిలో లివర్ ఎడమవైపు, గుండె కుడివైపుకు ఉంటుందన్నారు. 24 గంటల ప్రేగు, గాల్ బ్లాడర్ కూడ ఎడమవైపు ఉంటాయన్నారు. ఈ మహిళకు గాల్ బ్లాడర్‌లో రాళ్ళుతో పాటు మ్యూకోసిల్ వ్యాధి ఉన్నట్లు గుర్తించి, వెంటనే శాస్త్ర చికిత్స చేశామన్నారు. లాప్రోస్కోపిక్ ద్వారా ఆపరేషన్‌ను డాక్టర్ వసుంధర, డాక్టర్ శివప్రసాద్‌తో పాటు సిబ్బంది అజయ్‌బాబు, శివాజీ, సాంబశివరావు, నవీన్‌లు విజయవంతంగా చికిత్స అందించారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని వేమవరం గ్రామంలో వెంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. సుమారు 22వేల మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పాల పొంగళ్ళ సమర్పించి వారి వారి మొక్కు బడులను తీర్చుకున్నారు. యాత్రికులు దర్శనం చేసుకునేందుకు తగు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

'కొమ్మారెడ్డి'లో ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు

ప్రజాశక్తి-బంటుమిల్లి : మండలంలోని కొమ్మారెడ్డి స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులు ఘనంగా ఫేర్ వెల్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.యస్.వి.జి. శోభ, యంగ్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య వారి సతీమణి కె. హరిణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమ్మారెడ్డి కిషోర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో నూతన ఉత్సాహాన్ని కల్గిస్తాయని, విద్యార్థి జీవితంలో మరువలేని జ్ఞాపకంగా ఉంటాయని అన్నారు. విద్యా అనేది జీవన ప్రమాణాలను పెంచుతుందని, ప్రతి విద్యార్థి ప్రణాళికాబద్ధంగా 10 వ తరగతి పరీక్షలకు సంసిద్ధమై మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. 10 వ తరగతి అనంతరం విద్యార్థులకు ఉన్నటువంటి విద్యావకాశాలను, భవిష్యత్తులో ఏర్పరుచుకోవలసిన ప్రణాళికలను గురించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు కొమ్మారెడ్డి కిషోర్‌ని, కె.యస్.వి.జి. శోభలను సన్మానించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వత్సవాయి నుండే రోడ్డు పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - వత్సవాయి : వత్సవాయి నుండి చెవిటికల్లు వెళ్లి ఆర్అండ్‌బి రహదారి 60 కిలోమీటర్లు దూరం ఉండటంతో అధికారులు కాంట్రాక్టర్ల సహాయంతో మూడు స్టెప్పులుగా కాంట్రాక్టర్ వర్కులు చేస్తున్నారని ఈ కాంట్రాక్టర్లు వర్కులు జీరో వత్సవాయి నుండి ప్రారంభించకుండా జీరో చెవిటికల్లు రోడ్డు నుండి ప్రారంభించటం హాస్యస్పదంగా ఉందని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన వత్సవాయికి ప్రజలు రావాలంటే మాచినేని పాలెం, తాళ్లూరు, కాకరవాయి, ఖమ్మంపాడు వేముల నర్వ, తదితర గ్రామాల నుండి నిత్యం మండల కేంద్రానికి ప్రజలు వస్తుంటారు. విద్యార్థులు ప్రయాణికులు, నిరుద్యోగులు, రైతుల సైతం ప్రభుత్వ కార్యాలయాల వద్దకు, దుకాణాల వద్దకు వస్తుంటారు. వత్సవాయి గ్రామ సమీపంలో వేముల నర్వ వెళ్లి రహదారిలో రెండు కిలోమీటర్ల మేర రహదారుల పూర్తిగా వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు ఆర్అండ్‌బి రహదారి ప్యాచ్‌వర్క్‌లు వత్సవాయి గ్రామ వద్ద నుండి శివాపురం వెళ్ళు రహదారి వరకు వేయవలసి ఉండగా వత్సవాయి గ్రామాన్ని వదిలేసి శివాపురం వైపు నుంచి, ఆర్ అండ్ రహదారి ప్యాచ్‌వర్క్‌లు వేసుకుంటా రావటంతో వత్సవాయి గ్రామం రెండు కిలోమీటర్ల దూరం వచ్చే వరకు తారు రోడ్డు వేయటంతో మండల ప్రజలు పలు విమర్శలు చేస్తున్నారు. శివాపురం గ్రామం వద్ద 40 కిలోమీటర్ల నుండి నుండి 45 కిలోమీటర్ల పొడవు వరకు వరకు రూ.50 లక్షలు, 45 కిలోమీటర్ల నుండి 50 కిలోమీటర్ల వరకు రూ.35 లక్షలు, 50 కిలోమీటర్ల నుండి 59 కిలోమీటర్ల వత్సవాయి గ్రామ సరిహద్దు వరకు రూ.38 లక్షలు నిధులు మంజూరైనట్లు అధికారులు తెలుపుతున్నారు. కోటి 23 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.

నందిగామ ఆర్అండ్‌బి జెఇ కిషోర్ వివరణ కోరగా గ్రామాల్లో ఎక్కడైతే రోడ్డు బాగా దెబ్బ తిన్నదో ఆ గ్రామం వద్ద నుండి ఎంతవరకు రోడ్డు పూర్తిగా డ్యామేజ్ అయ్యిందో అక్కడి నుండి కొలత వేసుకొని వచ్చారు. శివాపురం వైపు రోడ్డు బాగా దెబ్బ తినటం వల్ల అటువైపు నుండి కొలత వేసుకుంటూ ఎస్టిమేట్ వేయడం జరిగిందని తెలిపారు. జగ్గయ్యపేట ఆర్అండ్‌బి డిఇ ఎవరైనా కోరగా మూడు స్టెప్పులుగా ఆర్అండ్‌బి రోడ్లు వేయడం జరుగుతుందని వత్సవాయి గ్రామం ముందు ప్యాచ్‌వర్క్‌లో మరో నిధులతో వేస్తామని తెలిపారు. శివాపురం 40 కిలోమీటర్ల నుండి పనులు ప్రారంభిస్తు వత్సవాయి వైపు వరకు వచ్చేవరకు ఆ గ్రామ సరిహద్దు వరకు నిధులు సరిపోవని తెలిపారు. ఉన్న నిధులతో గ్రామం వరకు ప్యాచ్‌వర్క్ చేస్తామని తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి బి.రాము మాట్లాడుతూ వత్సవాయి గ్రామం మేజర్ పంచాయతీ, మండల కేంద్రమైన వత్సవాయి గ్రామాన్ని వదిలేసి రోడ్డు బాగా దెబ్బతిందని శివాపురం వైపు నుంచి రోడ్డు వేయటం చాలా హాస్యాస్పదంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు వచ్చినప్పుడు మరలా వత్సవాయి గ్రామం ముందు ప్యాచ్‌వర్క్‌లు చేస్తామని అనడం చాలా విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. అధికారులు వత్సవాయి జీరో కిలోమీటర్ నుంచి పనులు ప్రారంభించాలని లేనిపక్షంలో ఆందోళనకు దిగాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

వత్సవాయి పోలీసుల హెచ్చరిక

ప్రజాశక్తి - వత్సవాయి : తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ దొంగలు చేస్తున్నట్లు వత్సవాయి ఎస్ఐ ఉమామహేశ్వరరావు అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ గృహ యజమానులు విహార యాత్రలకు వెళ్లినట్లయితే ఆ ఇంటికి తాళాలు వేసుకుని వెళ్ళటమే కాకుండా ఇరుగు పొరుగు వారికి సమాచారం ఇచ్చి వెళ్లాలని పోలీసులకు కూడా సమాచారాన్ని తెలియజేయాలని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వీలైనంతవరకూ నిఘా నేత్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విలువైన వస్తువులను, నగదును జాగ్రత్తగా ఉంచుకోవాలని వీలైనంతవరకు బ్యాంకుల్లో లాకర్‌లో ఉంచుకోవాలని సూచించారు. వాత్సవాయి పోలీస్ శాఖ సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎవరైనా అనుమానితులు మీ ప్రాంతాల్లో తిరిగితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

తడి పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 22, 23 తేదీల్లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రెడ్డిగూడెం మండలంలోని అన్ని గ్రామపంచాయతీలో ఇంటింటికి తిరిగి తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకరమైన చెత్త వేరువేరుగా గ్రామపంచాయతీలో పని చేసే క్లాప్ మిత్రాలకు ఇవ్వాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. తడి చెత్తను ఉపయోగించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో వానపాములను ఉపయోగించి వర్మీ కంపోస్ట్‌ను తయారు చేయడం జరుగుతుంది. పొడి చెత్తను సెగ్రిగేషన్ చేసి రీ సైక్లింగ్‌కు పంపనున్నట్లు తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమం ద్వారా అవగాహన పొంది గ్రామ పంచాయతీకి సహకరించాల్సిందిగా పంచాయతీ విస్తరణ అధికారి ప్రభాకర రావు కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

విజయేశ్వర దేవస్థానంలో ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మహాశివరాత్రి సందర్భంగా స్థానిక వన్‌టౌన్ ప్రకాశం బ్యారేజ్ వద్ద ఉన్న శ్రీ విజయేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి కళ్యాణ మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత తమ్మన కృష్ణ కిషోర్ - స్వాతి దంపతులచే స్వామివారిని పెండ్లి కుమారుని చేసే కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు బుద్ధ సూర్యకుమార్ శర్మ, మేడూరి వెంకట మోహన కృష్ణ శర్మ మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ నుంచి మార్చి ఒకటో తేదీ వరకు విజయేశ్వర స్వామి దేవస్థానంలో అనేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆరోజు రాత్రి 11 గంటల 15 నిమిషాలకు శ్రీ స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వారు వివరించారు. యాత్రికులు పెద్ద సంఖ్యలో ఆయా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి, పెద్ద సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం

ప్రజాశక్తి - విజయవాడ :

ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో కృష్ణా-గుంటూరు జిల్లాల పిడిఎఫ్ అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజాసంఘాల నేతలు కోరారు. విజయవాడ సిటీతో పాటు ఎన్‌టిఆర్ జిల్లాలో లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. విజయవాడ సిటీలోని అన్ని డివిజన్ల పరిధిలో సిఐటియు, ఉద్యోగ, కార్మికులు, పెన్షనర్లు, ఇతర ప్రజాసంఘాలు వారి వారి పరిధిలో కె.ఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ, గ్రూపు మీటింగ్‌లు, వ్యక్తిగతంగా గ్రాడ్యుయేట్స్‌ను కలుస్తూ ఆయా సంఘాల నేతలు ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా కృష్ణలంక 22వ డివిజన్‌లో సిఐటియు, పౌరసంక్షేమ సంఘం తదితర సంఘాలు ప్రచారం నిర్వహించాయి. ఈ సందర్భంగా సిఐటియు తూర్పు సిటీ ఉపాధ్యక్షులు బత్తుల చిన్నారావు మాట్లాడారు. లక్ష్మణరావు ఓటు ముద్ర సీరియల్ నెంబర్ 23లో 1వ ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమలో పౌర సంక్షేమ సంఘం నాయకులు వాజ శ్రీనివాసరావు, తూబాటి తాండవ కృష్ణ, మధ్యతరగతి ఉద్యోగుల సంఘం నగర నాయకులు కొమ్మూరి ఆనంద్, డివైఎఫ్ఐ తూర్పు సిటీ నగర అధ్యక్షుడు బత్తుల ఉమామహేశ్వరరావు, 22వ డివిజన్ డివైఎఫ్ఐ నాయకులు కొప్పిశెట్టి శ్రీనివాసరావు **కంచికచర్ల :** ప్రజా సమస్యలపై శాసనమండలిలో నిరంతరం గలమెత్తే పీడీయఫ్ అభ్యర్థి కెయస్ లక్ష్మణరావు గెలుపు చారిత్రక అవసరమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్ అన్నారు. కేయస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కంచికచర్లలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కంచికచర్ల పట్టణంలో మోడల్ కాలనీ, వసంత కాలనీ, హనుమాన్ పేటలో ఉద్యోగుల్ని, గ్రాడ్యుయేట్స్‌ని, నిరుద్యోగుల్ని, ఉపాధ్యాయులను కలిసి లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటేయాలని ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడైతూ గత 18 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పీడీయఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్ని వర్గాల సమస్యలపై శాసన మండలిలో గళమెత్తి ప్రజల పక్షాన పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ జహిదా, ఎస్.ఫ్.ఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.మాదవ్ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. **వత్సవాయి :** ప్రజా సంఘాల నాయకులు, కౌలు రైతు సంఘం నాయకులు తమ్మినేని రమేష్, సిఐటియు మండల నాయకులు కంచర్ల కొండయ్య పిలుపునిచ్చారు. కష్ణ గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణ్ రావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని ప్రజాసంఘాల నాయకులు చిగురుపాటి బాబూరావు, డివి కృష్ణ కోరారు. మండల కేంద్రమైన వత్సవాయిలో ప్రజాసంఘాల నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాయితీ నిబద్ధత గల కె.ఎస్. లక్ష్మణరావుని గెలిపించాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు, , బి రాము, సుందరయ్య, కోరపాటి వెంకటి, సోమ రవి, బోతపల్లి బిక్షం, తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట : ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ పట్టణంలోని తొర్రగుంటపాలెంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటర్లకు కరపత్రాలు పంచుతూ ఓటు వేయాలని కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు శాసనమండలిలోకి వెళ్లిన తర్వాత ఉద్యోగులు ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగులు కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అంగన్వాడీ కార్యకర్తలు సామాజిక తరగతులు ప్రభుత్వ ప్రైవేటు కాలేజీ అధ్యాపకులు ఆధ్యాపకేతర సిబ్బంది ఉపాధ్యాయ ఉద్యోగ మొదలగు వారి సమస్యలను శాసనమండలి లో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం కాకుండా అనేక సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కోటా రవికుమార్, దంతాల నరేంద్ర, వి వి రాంప్రసాద్, జె వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ 22వ డివిజన్‌లో ప్రచారం...

కంచికచర్లలో...

వత్సవాయిలో...

జగ్గయ్యపేటలో...

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి సంగారెడ్డి జిల్లా తాళ్లూరు వాస్తవ్యులు కీర్తిశేషులు రావూరి బసవయ్య ధర్మపత్ని సక్కుబాయమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు రావూరి ముత్తయ్య, పుష్ప రూ.25,116 లు, ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలం చిమ్మపూడి వాస్తవ్యులు నాగల వీరయ్య భార్య వీరమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు పుల్లయ్య, చుక్కమ్మ రూ.25,116లు అందజేసినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి ఎంకెటిపిఎస్ ప్రసాద్, ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్ భరద్వాజ్ తెలిపారు.

దేవినేని అవినాష్‌కు సన్మానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : విజయవాడలో జిల్లా పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్‌ను ఆయన కార్యాలయంలో జగ్గయ్యపేట నియోజక వర్గానికి చెందిన రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శిగా బత్తుల రామారావును, జిల్లా రైతు విభాగ అధ్యక్షులుగా ఏలూరి శివాజీని నియమించిన సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్‌ను పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు వట్టెం మనోహర్, రాష్ట్ర విద్యార్థి వింగ్ వైస్ ప్రెసిడెంట్ దండమూరి రాజేష్, కన్నమాల శామ్యూల్, పట్టణ యువజన విభాగ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ళ సురేష్ తదితరులు అవినాష్‌ను సన్మానించారు.

ఖాదర్ మృతి తీరని లోటు : టిడిపి

ప్రజాశక్తి ఎ.కొండూరు : ఎ.కొండూరు మండలం చీమలపాడు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు షేక్ ఖాదర్ అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడున్నారు. భార్య కూడా ఇటీవల మృతి చెందింది. ఖాదర్ మతదేహాన్ని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గడ్డి కష్ణారెడ్డి, గ్రామ టిడిపి అధ్యక్షుడు బెజవాడ శంకర్,టిడిపి నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నాగాయలంక : నాగాయలంకలో స్వచ్ఛ కార్యక్రమాలు కొనసాగిస్తున్న సీనియర్ స్వచ్ఛ నాగాయలంక కార్యకర్త నలుకుర్తి ఆదాము గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఆదాం మృతదేహాన్ని సేవలను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ కోవిడ్ తరువాత స్వచ్ఛ నాగాయలంక కార్యక్రమాలు నిలిచిపోయిన ప్పటికీ స్వచ్ఛ కార్యక్రమాల నుంచి ప్రేరణ పొందిన ఆదాం వాటిని కొనసాగించారని కొనియాడారు. ఆదాం మృతికి నివాళులర్పించిన వారిలో పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్, మండవ బాలవార్థిరావు, చిట్టా అన్నాపూర్ణయ్య, ఎంపీటీసీ లంకె శ్రీనివాస ప్రసాద్, సర్పంచ్ కొక్కిలిగడ్డ ఆంకాలు, మెదికొండ విజయ్, తలశిల రామకష్ణ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న పిటిడి ఉద్యోగుల దీక్ష

ప్రజాశక్తి-ఉయ్యూరు : కేంద్ర కార్యాలయ సర్కులర్కు వ్యతిరేకంగా జరిపిన చార్జ్ కౌన్సిలింగ్ రద్దు చేయాలని, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీటీడీ ఉద్యోగులు ఆర్టీసీ బస్ స్టాండ్ ఆవరణలో చేపట్టిన రిలేదీక్ష ఆదివారం పదవ రోజుకు చేరుకుంది. అసోసియేషన్ జో నల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేశ్, అవనిగడ్డ డిపో సెక్రటరీ కుమార్ దీక్ష శిబిరాన్ని ప్రా రంభించారు. జీఎస్ రావు, నాంచారయ్య దీక్షలో కూర్చోగా మచిలీపట్నం డిపో సెక్రటరీ కిరణ్, అవనిగడ్డ డిపో సభ్యులు లక్ష్మయ్య, బీవీ రావు దీక్ష శిబిరానికి విచ్చేసి సం పూర్ణ మద్దతు తెలిపారు. ఉయ్యూరు డిపో సెక్రటరీ పీఎం కష్ణ, అసిస్టెంట్ సెక్రట రీ అరుణోదయ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాండవులు, కమిటీ సభ్యుడు ఎల్ఎస్ రావు, కి షోర్, భాగ్యలక్ష్మి పూర్ణచంద్రరావు సంఘీభావం తెలిపారు.

దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ మండపం ప్రారంభం

ప్రజాశక్తి-ఉయ్యూరు : కలవపాములలో దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ మండపాన్ని వెల్లంకి ఫుడ్స్ అధినేత వెల్లంకి శంకరరావు, వెంకట రాధారాణి దంపతులు ఆదివారం ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన ఆలయ మండపం జీర్ణావస్థకు చేరుకోగా గ్రామస్తుల కోరిక మేర వెల్లంకి శంకరరావు రూ.30 లక్షలతో మండపంతో పాటు ఆలయంలో ఇతర పనులు పునఃనిర్మించగా వేదపండితులు మంత్రోచ్చారణ నడుమ ప్రారంభించారు. వెల్లంకి బాబా కోటేశ్వరరావు, వెల్లంకి రాఘవేంద్రరావు, కలపాల మల్లేశ్వరరావు సేవలందించారు. ఈకార్యక్రమానికి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, గ్రామస్తులు పెద్ద యెత్తున హాజరయ్యారు. అనంతరం అన్న సమారాధన చేశారు.

ప్రకృతి వ్యవసాయం సందర్శన

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో చెత్త సంపద కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగుచేసిన పంటలను గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి పరిశీలించారు నియోజకవర్గ ప్రకృతి మాస్టర్ ట్రైనర్ జీవన రప్ప ఆధ్వర్యంలో సంపద కేంద్రం వద్దకు రెండు నెలల క్రితం పంటల సాగు చేపట్టారు. ఇప్పటికే ఆకు కూరలు విక్రయిస్తున్నారని ప్రస్తుతానికి అందుబాటులో వచ్చిన ముల్లంగిని నందిగామ రైతుబజారుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

ఖజానా శాఖ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అపరిష్కతంగా ఉన్న ఖజానా విభాగం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ అండ్ ఎకౌంట్స్ సర్వీస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా సంఘ నూతన కార్యవర్గం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని సంఘ నూతన అధ్యక్షులు కాకాని నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఖజానా శాఖ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఆదివారం గవర్నర్ పేటలోని ఖజానా శాఖ కార్యాలయంలో ఎన్నికల అధికారి షేక్ హసీనా బేగం నిర్వహించారు. జిల్లా కార్యవర్గంలోని 11 పదవులు ఒక్కొక పదవికి ఒక్కొక్కరే నామినేషన్ దాఖలు చేసినందున కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ఆమె తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులు గా కాకాని నాగేశ్వరరావు కార్యదర్శిగా ఏలూరి నరేష్ (సీనియర్ అకౌంటెంట్, జగ్గయ్యపేట) సహాధ్యక్షులుగా కె. మల్లేశ్వర రావు (విజయవాడ ఎస్టిఓ), ఉపాధ్యక్షులుగా అర్షద్ ఒమర్ (తిరువూరు ఎస్టిఓ), బి. సరళ కుమారి (సీనియర్ అకౌంటెంట్, విజయవాడ), ఎండి జమీలున్నీసా (సీనియర్ అకౌంటెంట్, విజయవాడ), కార్యదర్శిగా ఎం. ప్రవీణ్ బాబు (సీనియర్ అకౌంటెంట్, విజయవాడ), కార్యనిర్వాహక కార్యదర్శిగా అబ్దుల్ వదూద్, సంయుక్త కార్యదర్శులుగా బి. చిన్న నిర్మల, వి. శ్రీనివాస్, ఎన్. భార్గవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సంఘ సభ్యులు తమ మీద ఉన్న నమ్మకంతో ఏకగ్రీవం గా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఖజానా శాఖ ఉద్యోగుల సమస్యల రాష్ట్ర సంఘం నాయకుల దష్టికి, ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర నాయకత్వం దష్టికి తీసుకెళ్తామన్నారు. పదవులు పొందిన ప్రతి ఒక్కరు క్షేత్రస్థాయిలో ఖజానా శాఖ ఉద్యోగులు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక వాతావరణంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎన్నికలకు సహాయ ఎన్నికల అధికారిగా ఫయాజ్ అహమ్మద్, పరిశీలపరాలిగా జె. కరుణ వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి పలు ఉద్యోగ సంఘాల నాయకులు ఖజానా శాఖ అధికారులు ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

పరిమితికిమించి ఇసుక రవాణా

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో విచ్చలవిడిగా పరిమితికి మించి ఓవర్ లోడుతో ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. స్థానిక అధికారులు ఇసుక మాఫియాకు దాసోహమై మాముళ్ల మత్తులో కొట్టు మిట్టాడుతున్నారు. ముఖ్యంగా రవాణా శాఖ అధికారులు ఓవరు లోడు ఇసుక లారీలపై కేసులు నమోదు చేయకుండా అధికార పార్టీ నాయకులకు సలాం కొడుతూ లాలూచి పడుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నందిగామ నియోజకవర్గంలో చందర్లపాడు మండలం కాసరబాదు కృష్ణానది ర్యాంపు నుంచి పరిమితికి మించి ఇసుక రవాణా రాత్రి పగలు తేడా లేకుండా జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ అక్రమ, పరిమితికి మించి ఇసుక రవాణాను అడ్డుకునే అధికారులే కనిపించడం లేదు. ఈ సందర్భంగా శనివారం ఉదయం జాతీయ రహదారిపై ఓవర్ లోడుతో ఇసుక టిప్పర్లు పరుగులు పెడుతున్న అధికారుల్లో చలనం లేదు. ఓవర్ లోడ్ లారీల వల్ల చందర్లపాడు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు దెబ్బ తింటున్నాయి. తక్షణమే సంబందిత శాఖల అధికారులు ఈ అక్రమ ఓవర్ లోడ్ వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి పై ఓవర్ లోడుతో వెళ్తున్న ఇసుక టిప్పర్లు

వైభవంగా వీరమ్మ వసంతోత్సవం

ప్రజాశక్తి-ఉయ్యూరు : వీరమ్మ వసం తోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పదిహేను రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన తిరు నాళ్ల శనివారం రాత్రితో ముగియగా తిరుగు గండ దీపాల భక్తులు వెంటరాగా ఊరంతా ఊరేగి ఆదివారం మధ్యాహ్నం రావిచెట్టు సెంటర్ లోని మెట్టినింటికి చేరుకున్నారు. గ్రామోత్సవం అనంతరం మెట్టినింటికి చేరుకున్న అమ్మవారికి పారుపూడి వంశస్థుల ఆడపడుచులతో పాటు పలువురు మహిళలు స్వాగతం పలుకుతూ బిందెలతో నీళ్లువారపోసి వసంతోత్సవం ఆడారు. మెట్టినింటికి చేరుకున్న వీరమ్మ శివరాత్రి రోజున తోట్లవల్లూరు మండలం ఐలూరులో కష్ణానదీ పాయల్లో పవిత్ర స్నానమాచరించి తిరిగి మెట్టినింటికి చేరకుంటారు.

తప్పులను సవరించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి (మొవ్వ) : ఈనెల 27వ తేదీ జరగనున్న కష్ణ గుంటూరు ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల లిస్టులో ప్రచురించబడిన తప్పులను సవరించాలని ఏపీ కౌలురైతు సంఘం కష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ఎన్నికల అధికారులను కోరారు. ఆయన అందించిన వివరాల ప్రకారం మొవ్వ మండలం బూత్ నెంబర్ 167లో సీరియల్ నంబర్ 138, 139లో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు, బూత్ నెంబర్ 167 లో సీరియల్ నంబర్ 327,328, 330లో ఒకే వ్యక్తి మూడు ఓట్లు కలిగి ఉన్నారని వివరించారు. సంబందిత అధికారులు పరిశీలించి ఒకటి కన్నా ఎక్కువ ఓట్లు ఉన్న వాటిని తొలగించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి విస్సన్నపేట:: విస్సన్నపేట మండలంలో తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు ఆదివారం పర్యటించారు. ముందుగా చంద్రుపట్లలోని ఒక కార్యక్రమానికి హాజరై చిన్నారి భవిష్యను ఆశీర్వదించారు. అనంతరం విస్సన్నపేటలోని పలు సమస్యలపై పర్యటించారు. ముఖ్యంగా బిజెఆర్ కాలనీకి సంబంధించి స్మశాన వాటిక చాలా ఏళ్లుగా తీవ్ర సమస్యగా ఉండడంతో స్థానికులు ఆయనకు తెలిపారు. ప్రస్తుతం ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి జె ఆర్ యూత్ కమిటీ పల్లెపాము రాంబాబు మేసుపాం ప్రభాకర్ సుధాకర్ మేకల కిరణ్ నంద్రు రాజేష్ టిడిపి నాయకులు మురుగుల ప్రసాద్ తుమ్మలపల్లి అనిల్ సునీల్ జనసేన మండల అధ్యక్షులు షేక్ యాసిన్ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట స్థానిక బాబు జగజ్జీవన్‌రావ్ నగర్‌కు చెందిన తేళ్లూరి ఆనంద్ ఇటీవల ఆటో ప్రమాదానికి గురై అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న బిజెఆర్ నగర్ యూత్ కమిటీ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి బాధిత కుటుం బానికి అండగా నిలిచి రూ.15వేలు ఆర్థిక సహాయం అందిం చారు. పల్లెపాము రాంబాబు, మేసుపాం కృష్ణ చైతన్య, మేకల కిరణ్ కుమార్, దగ్గుల మల్లయ్య, బొడ్డు అశోక్ పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్ద ఘర్షణ

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండలంలో నవాబు పేట వద్ద ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పెనుగంచిప్రోలు ఎస్ఐ తెలిపారు. మద్యం దుకాణాల వద్ద మొలకలపల్లి సుబ్బారావుపై అదే గ్రామానికి చెందిన షేక్ రాజా సైదాలు దాడి చేసినట్లు తెలిపారు. సుబ్బారావు తలకు గాయం కావడంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తుదిదశకు ఎంఎల్‌సి ఎన్నికల ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయవాడ: ఈ నెల 27న జరిగే కృష్ణా-గుంటూరు జిల్లాల శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసే పనిలో ఎన్‌టిఆర్ జిల్లా అధికారులు ఉన్నారు. దాదాపుగా ఎన్నికల ఏర్పాట్లన్నీ పూర్తి అయినట్లు అధికారులు వివరిస్తున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 25 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, పిడిఎఫ్ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, అలాగే కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా మధ్యనే ప్రధాన పోటీ నెలకొన్నది. ఎన్‌టిఆర్ జిల్లాలో 78,063 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 45,425 మంది పురుషులు కాగా, 32,625 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మరో 13 మంది టీజి ఓటర్లు ఉన్నారు. విజయవాడ సిటీతోపాటు జిల్లా వ్యాప్తంగా 112 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, వీటిల్లో 11 అనుబంధ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ నెల 27 ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి 3న ఓట్లు లెక్కింపు ఉంటుంది. మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. అప్పటి వరక ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి) అమల్లో ఉంటుంది. ఎన్నికల అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించడానికి కలెక్టరేట్‌లో 0866-2575822 నంబర్‌తో కమాండ్ కంట్రోల్ రూమ్ పని చేస్తుందని, ఉల్లంఘనలపై ఈ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చునని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ తెలిపారు. ఎంసిసి నోడల్ అధికారిగా కె శ్రీనివాసరావు, స్వీప్ నోడల్ అధికారిగా యు శ్రీనివాసరావు వ్యవహరిస్తారు.

పోలింగ్ నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 224 మంది ప్రిసైడింగ్ అధికారులు (పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల(ఏపీవో)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎన్నికల నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలుకువలపై వీరికి ఇప్పటికే రెండుదశల్లో శిక్షణ పూర్తి అయింది. ఎన్నికల జనరల్ అబ్జర్వర్ వి.కరుణ.. నియోజకవర్గ పరిధిలోని జిల్లాల కలెక్టర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులతో శనివారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అన్ని రకాల చర్యలు, ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వివరించారు. జిల్లాలోని 112 పోలింగ్ స్టేషన్లకు 112 మంది పీవోలు, 112 మంది ఏపీవోలను నియమించారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఇద్దరు చొప్పున ఇతర ప్రిసైడింగ్ అధికారుల (ఓపీవో)ను నియమించారు. మూడు కేటగిరీలకు సంబంధించి రిజర్వ్ కేటగిరీలో 90 మంది సిబ్బందిని సిద్ధం చేశారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఒకరు చొప్పున మొత్తం 112 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. 19 మందిని రిజర్వ్‌లో ఉంచారు. జిల్లాకు సంబంధించి విజయవాడ, నందిగామ, తిరువూరు డివిజన్లలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించారు. మొత్తం 224 బ్యాలెట్ బాక్సులు అవసరం కాగా రిజర్వ్‌తో కలిపి 324 బాక్సులను అందుబాటులో ఉంచారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు 454 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో 24 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ (ఎఫ్ఎస్‌టీ) విధులు నిర్వర్తిస్తున్నాయి. 11 చెక్‌పోస్టుల వద్ద రెండు షిఫ్ట్‌ల్లో 22 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీ) విధుల్లో ఉన్నాయి. ఏడు వీడియో సర్వైలెన్స్ టీమ్స్ (వీఎస్‌టీ) కూడా పనిచేస్తున్నాయి. అన్ని పోలింగ్ స్టేషన్లలోనూ వెబ్‌క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. రూట్ ఆఫీసర్లు, సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీర్లను కూడా అవసరం మేరకు నియమించినట్లు అధికారులు వివరించారు. ఎన్నికల ఏర్పాట్లతో పాటు నియమ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల వ్యయ పరిశీలన బృందం అప్రమత్తతతో పనిచేస్తున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వివరిస్తున్నారు.

ఎగుమతుల వేగవంతానికి అమెజాన్ భాగస్వామ్యం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈ కామర్స్ ఎగుమతులను వేగవంతం చేయడానికి అమెజాన్ సంస్థ, ఫారిన్ ట్రేడ్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు అమెజాన్ గ్లోబల్ ట్రేడ్ డైరెక్టర్ భూపేస్ వాకేంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా ఎం ఎస్ ఎమ్ ఈ లకు, ఈ కామర్స్ ఎగుమతుల్లో విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలు, వనరులను సమకూరుస్తుంది అన్నారు. రానున్న కాలంలో ఇంకా ఎగుమతులు ప్రోత్సహించడానికి ఎంత గానో ఉపయోగ పడుతుందని అన్నారు.

మాట్లాడుతున్న వెస్ట్ ఎసిపి దుర్గారావు

అవాంఛనీయ ఘటనలకు తావివ్వొద్దు : వెస్ట్ ఎసిపి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఎటువంటి అవాంఛ నీయ సంఘ టనలు జరగ కుండా రంజాన్ స్టాల్స్ నిర్వ హిం చుకోవాలని వెస్ట్ ఎసిపి దుర్గారావు తెలిపారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏ ఎస్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో వెస్ట్ డివిజన్ ఎసిపి ఎన్.వి.ఎస్.కె.దుర్గారావు, టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ ఎస్‌సిహెచ్.కొండలరావు ఆధ్వర్యంలో పీస్ కమిటీ సభ్యులు, రంజాన్ స్టాల్స్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి దుర్గారావు మాట్లాడుతూ రంజాన్ స్టాల్స్ వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సాధారణ జన జీవనానికి ఎలాంటి ఇబ్బందీ కలగకుండా మునిసిపల్ కమిషనర్ పర్మిషన్ ఇచ్చిన పరిధి మేరకు స్టాల్స్ నిర్వహించుకోవాల్సిందిగా తెలిపారు.

చిరువ్యాపారులపై ఒత్తిడి

విజయవాడ : ఆదాని కరెంటు స్మార్ట్ మీటర్లు కొనుక్కోమని ప్రజలపై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి చేస్తుందని, చిరు వ్యాపారులకు ఉదయం 6 గంటల నుండి రాత్రి పది గంటల వరకు ఒక టారీఫ్, రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు ఒక టారిఫ్ పేరుతో కరెంటు ఛార్జీలు పెంచటానికి ప్రయత్నం చేస్తుంటే దాన్ని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తుందని పౌర సంక్షేమ సంఘం నాయకులు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు మోపటానికి సిద్ధపడిందని, ప్రభుత్వం అమలు చేస్తుందని దీన్ని వ్యతిరేకిస్తూ 29వ డివిజన్ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని మధురానగర్ పప్పుల మిల్లు సెంటర్లో నిరసన నిర్వహించారు. రాబోయే కాలంలో అన్ని డివిజన్లోనూ ఈ కార్యక్రమాలను చిరు వ్యాపారులను కలుపుకొని కార్యక్రమాలు నిర్వహించడానికి పౌరు సంక్షేమ సంఘం పిలుపునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి బి.చిన్న, కృష్ణమూర్తి, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు

ఎన్‌టిటిపిఎస్ హై రికార్డ్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :

విద్యుత్ ఉత్పాదనలో తన రికార్డులను తానే తిరగ రాసుకుంటూ డాక్టర్ ఎన్టీటీపీఎస్ మరో ఘనతను సాధించింది. చీఫ్ ఇంజనీర్ టి.నాగరాజు సారధ్యంలో డాక్టర్ ఎన్టీటీపీఎస్, ఒకే రోజు 52.73 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేసి ఆల్ టైం హై రికార్డ్ సాధించి చరిత్రలో మరో మైలురాయిని చేరుకుంది. ఇదే నెల 18న అత్యధికంగా 51.63 మిలియన్ యూనిట్ల రికార్డ్ ఉత్పత్తిని సాధించింది. ఇటీవలే డాక్టర్ ఎన్టీటీపీఎస్ ఎనిమిదో యూనిట్ 800 మెగావాట్ సామర్థ్యంతో వాణిజ్య ఉత్పాదన ప్రారంభించినప్పటి నుంచి సాంకేతికంగా ఎన్నో సమస్యలు తలెత్తాయి. అయినప్పటికీ విద్యుత్ ఉత్పాదనలో డాక్టర్ ఎన్టీటీపీఎస్ రికార్డులు మోత మోగిస్తూ వస్తోంది. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ నాగరాజు మాట్లాడుతూ ఏపీ జెన్కో మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్ బాబు వారి సహకారంతో ఇంతటి ఘన విజయం సాధించామని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఘనత సాధించడంలో ప్రతి ఒక్క ఇంజనీర్, ఉద్యోగి, కార్మికుడి పాత్ర ఉందని, భవిష్యత్తులో అందరం కష్టపడి సంస్థకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన కోరారు. ప్రతి ఒక్క కార్మికుడికి, ఇంజనీర్‌కి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అదే కోవలో మరికొన్ని యూనిట్లు 50 రోజులు పూర్తి చేసుకొని వందరోజుల రికార్డును సాధించడానికి సిద్ధంగా ఉన్నాయని అన్నారు. డాక్టర్ ఎన్టీటీపీఎస్ యూనిట్లు సుమారు 40 సంవత్సరాలు దాటినా ప్రభుత్వం, ఏపీ జెన్కో మేనేజ్మెంట్ వారి సహకారంతో, ఎంతో నిష్ణాతులైన ఇంజనీర్లు, కార్మికులు ఎంతో శ్రమిస్తూ, ఎంతో సమర్థవంతంగా విద్యుత్ ఉత్పాదన కావిస్తున్నామని అన్నారు. ఇటీవల కాలంలో ఇంచుమించు అన్ని యూనిట్లను వార్షిక మరమ్మతులు పూర్తిచేసి విజయవంతంగా విద్యుత్ ఉత్పాదన సాగిస్తున్నామని, నాణ్యమైన విద్యుత్తు ఉత్పత్తి చేసి ప్రజలకు అందించడంలో విద్యుత్ ఉద్యోగులందరూ ఎంతో శ్రమిస్తున్నారని ఆయన కొనియాడారు.

సౌమ్య కు సమస్యలు వివరిస్తున్న ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి - నందిగామ : హౌసింగ్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శేషం తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందిగామ ఎంఎల్ఎ ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యను తిరుపతిరావు కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్టీఆర్ స్థాపించిన కాంట్రాక్టు వ్యవస్థను కాపాడాలని కోరారు. పలువురు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎంఎల్ఎ తంగిరాల సౌమ్యను కలిశారు.

వాహన కాలపరిమితి డ్రాఫ్ట్‌పై లారీ ఓనర్స్ లేఖ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వాహన కాలపరిమితి కుదిస్తూ కేంద్రం జారీచేసిన ముసాయిదా నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. 12 సంవత్సరాల కన్నా పాత వాహనాలపై ఆంక్షలు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 7న జారీచేసిన డ్రాఫ్ట్ పట్ల ఆందోళన వ్యక్తంచేస్తూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శికి లేఖ పంపినట్లు అధ్యక్షులు నాగుమోతు రాజా, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యనారాయణ తెలిపారు. దేశవ్యాప్తంగా స్వయం ఉపాధి పొందుతున్న డ్రైవర్లు ఈ డ్రాఫ్ట్ నిబంధనల వల్ల జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇది రవాణా రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని, పాత వాహనాలపై ఆంక్షలు విధించడం వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థ, ఇతర ముఖ్య సేవలు నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థికభారం పెరుగుతుందన్నారు. ఇప్పటికే అధిక టోల్ ఛార్జీలు, చమురు ధరల వల్ల ఇబ్బందులు పడుతున్న వాహన యజమానులపై కొత్త రవాణా నిబంధనల పేరుతో మరింత భారాన్ని మోపడం తగదని, వెంటనే కేంద్రం పునరాలోచన చేయాలన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎ.కొండూరు : అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ప్రకారం మండలం రామచంద్రాపురం గ్రామపంచాయతీ శివారు లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొండెబోయిన రాంబాబు (45) మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాంబాబు వ్యవసాయం నిమిత్తం కొంత మేర అప్పులు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాంబాబు నాలుగు రోజులుగా ఇంటికి రాకుండా వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి చుట్టుపక్కల ప్రాంతాల్లో, గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవటంతో ఆదివారం లక్ష్మీపురం గ్రామంలో మామిడి తోటలో చెట్టుకు ఉరి పెట్టుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతుని కుమారుడు కొండబోయిన విష్ణువర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా కృష్ణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండలంలోని కొనకంచి జిల్లా పరిషత్ పాఠశాల నందు వజ్రోత్సవాలను పురస్కరించుకొని పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు వారి చదువు, స్థితిగతులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఆనాడు చదువుకున్న, ఆటల పాటలు, చదువులపై మరోసారి గుర్తు చేసుకుని నెమరు వేసుకున్నారు. సంతోషదాయకంగా గడిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.